క్లుప్తంగా

ఓపెన్ స్కూల్ స్టడీ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోండి

పాన్‌గల్: మండలంలోని కేతేపల్లి ఉన్నత పాఠశాల ఓపెన్ స్కూల్ స్టడీ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోని జీహెచ్‌ఎం శ్రీనివాసులు ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు. ఈ స్టడీ సెంటర్‌లో దూర విద్య ద్వారా పదో తరగతి, ఇంటర్ కోర్సులు పూర్తి చేసే అవకాశం ఉందని, ఎలాంటి విద్యార్హతలు లేకున్నా పదో తరగతిలో చేరవచ్చునని, ఇంటర్‌లో చేరేందు పదో తరగతి అర్హత ఉండాలని తెలిపారు. ఆయా కోర్సులలో చేరేందుకు సెప్టెంబర్ 10వ తేదీ వరకు ఫీజు చెల్లించవచ్చని, వివరాలకు అసిస్టెంట్ కోఆర్డినేటర్ 8555887342 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ట్రాఫిక్ నియమాలు పాటించాలి

అమరచింత: ట్రాఫిక్ నియమాలను పాటించపోతే వాహనదారులపై చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ సురేష్ కుమార్ తెలిపారు. ద్విచక్ర వాహనాలకు నంబర్ ప్లేట్ లేకుండా తిరుగుతున్నారని, మైనర్ బాలలకు వాహనాలను ఇస్తున్నారని, ట్రిపుల్ రైడింగ్ చేయ్యడం అలవాటుగా మార్చుకున్న వారిపై ఇక నుంచి కేసులు నమోదు చేస్తున్నట్లు తెలిపారు.

స్తంభం పాతారు.. కనెక్షన్ మరిచారు



పాన్‌గల్: మండలంలోని గోప్లాపూర్‌లో ఒకటవ వార్డులో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభం స్థానంలో కొత్త స్తంభం పాతారు. కానీ కనెక్షన్ ఇవ్వడం మరిచారు. ఎన్నో ఏళ్లుగా ప్రమాదకరంగా ఉన్న స్తంభాన్ని తొలగించడంలో అధికారుల నిర్లక్ష్యంపై కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి ప్రమాదం చోటుచేసుకోక ముందే స్తంభాన్ని తొలగించి కొత్త స్తంభానికి కనెక్షన్ ఇవ్వాలని కోరుతున్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత చదవాలి



కొత్తకోట రూరల్: భగవద్గీతలోని శ్రీకృష్ణుడు చెప్పిన మొట్టమొదటి శ్లోకంలో జ్ఞానంను గ్రహించేందుకు ప్రతి ఒక్కరూ త్రైత సిద్ధాంత భగవద్గీతను చదవాలని ప్రబోధ సేవాసమితి కమిటీ పట్టణ అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని రాఘవేంద్ర కాలనీలో త్రైత సిద్ధాంత గ్రంథాల గురించి కాలనీ వాసులకు వివరించారు. కార్యక్రమంలో బాలకృష్ణ, మాసన్న, వేణుగోపాల్, శివ, సిమ్మయ్య, శైలజ, జ్యోతి, శంకరమ్మ, ప్రమీల, మంజుల, లయ తదితరులు ఉన్నారు.

విజయ్‌కుమార్‌కు డాక్టరేట్



స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లాకు చెందిన ప్రముఖ ద్విభాషా (తెలుగు, హిందీ) కవి ఎం ఎన్.విజయ్‌కుమార్‌కు న్యూఢిల్లీ ఫరీదాబాద్ మ్యాజిక్, ఆర్ట్ యూనివర్సిటీ వారు డాక్టరేట్‌తో సత్కరించారు. శనివారం జరిగిన ఓ కార్యక్రమంలో విజయ్‌కుమార్‌కు డాక్టరేట్ ప్రదానం చేశారు. శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ సీపీ యాదవ్, అంతర్జాతీయ ప్రఖ్యాత మేజిషియన్ డాక్టర్ రాజ్‌కుమార్, మేవార్ యూనివర్సిటీ డైరెక్టర్ ఎస్‌కే.రోహిల్లా, ప్రముఖ మేజీషియన్ పీఎస్ జెన్ తదితరులు హాజరయ్యారు. విజయ్ కుమార్ మాట్లాడుతూ హిందీ భాషాభివృద్ధికి, హిందీ సాహిత్య రంగానికి చేసిన కృషికి డాక్టరేట్‌తో సత్కరించడం సంతోషంగా ఉందన్నారు.

వైభవంగా వార్షికోత్సవ పూజలు



దేవరకద్ర: మండల కేంద్రంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో 8 వ వార్షికోత్సవ పూజలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. 108 కలశాలతో పలువురు మహిళలు ఊరేగింపుగా దేవాలయం చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి వట్టివేర్లను చుట్టి పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం మహిళలు, పిల్లలు, పెద్దలు కలశ జలాలతో అభిషేకాలు నిర్వహించారు. అలంకారం అనంతరం ఘనంగా పూజలు చేశారు. అదేవిధంగా ఆలయంలో పరమేశ్వరుడికి పంచామృతంతో అభిషేకం చేశారు. పూజలు ఉదయం నుంచి సాయంత్రం వరకు కొనసాగాయి. లలితా సహస్ర నామార్చన, పల్లకీసేవ తదితర కార్యక్రమాలు చేపట్టారు.

కేజ్ వీల్స్‌తో రోడ్ల ధ్వంసం



రామకృష్ణాపురం-మిరాసిపల్లి మధ్య కేజ్‌వీల్స్ ట్రాక్టర్లు వెళ్లడంతో ధ్వంసమైన బీటీ రోడ్డు

- నిబంధనలు పాటించని ట్రాక్టర్ల డ్రైవర్లు, యజమానులు
- వాహనదారులకు ఇబ్బందులు

కొత్తకోట రూరల్: రహదారుల నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.కోట్లు వెచ్చిస్తుంటే అధికారులు వాటి నిర్వహణను గాలికి వదిలేస్తున్నారు. ఏడాది గడవక ముందే రోడ్లన్నీ కంకర తేలి, పగుళ్లు వస్తున్నాయి. వ్యవసాయ సీజన్‌లలో ట్రాక్టర్లు కేజీవీల్స్‌తో బీటీ రోడ్డుపై ప్రయాణిస్తుండటంతో రోడ్లన్నీ ధ్వంసమవుతున్నాయని ప్రజలు మండిపడితున్నారు.

నిబంధనలకు పాతర..

మండల వ్యాప్తంగా 22 పంచాయతీలు ఉండగా ఊరికో 10 నుంచి 20 ట్రాక్టర్ల వరకు ఉన్నాయి. వరి సాగుకు పొలాలు సిద్ధం చేసేందుకు ఈ ట్రాక్టర్లు కేజ్ వీల్స్‌తో రోడ్లపైకి వస్తున్నాయి. ఇలా ట్రాక్టర్లు రావడంతో రోడ్లన్నీ ధ్వంసమై పూర్తిగా దెబ్బతినడంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. రూ.కోట్లు వెచ్చించి బీటీ రోడ్లు వేసినప్పటికి ట్రాక్టర్లను పట్టీలు లేకుండా రోడ్లపై ప్రయాణించకూడదనే నిబంధన ఉన్న అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

చర్యలు శూన్యం..

రోడ్లపై కేజీవీల్స్‌తో ప్రయాణిస్తే సదరు ట్రాక్టర్ యజమానిపై ఆర్‌అండ్‌బీ, పోలీసులు, రెవెన్యూ అధికారులు జరిమానాలు విధించాలి. తప్పనిసరైతే కేసులు నమోదు చేయాలి. కానీ మండల వ్యాప్తంగా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో యజమానులు స్వేచ్ఛగా తిరుగుతున్నారు. ఇప్పటి వరకు ఒక్క ట్రాక్టర్‌పై చర్యలు తీసుకోకపోవడం అధికారుల పనితీరుకు ఏవిధంగా ఉందో అర్థమవుతుంది. ఇప్పటికైనా సంబంధిత శాఖల అధికారులు స్పందించి చర్యలు తీసుకుంటే వాహనదారులకు సౌకర్యవంతమైన ప్రయాణం దక్కనుంది.

చర్యలు తీసుకోవాలి



కేజీవీల్స్ ట్రాక్టర్లతో రోడ్లు ధ్వంసం అవుతున్నాయి. అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. దీంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. రాత్రివేళ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రోడ్లపైకి వచ్చే అటువంటి ట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలి.

– తిరుపతయ్య, సత్యహళ్లి

ట్రాక్టర్లను సీజ్ చేస్తాం



రోడ్డు భద్రతపై గ్రామస్తులు దృష్టి సారించాలి. కేజ్ వీల్స్‌తో ప్రయాణించి రోడ్ల ధ్వంసం చేస్తున్నారనే సమాచారం వస్తుంది. ఇలాంటి ట్రాక్టర్ల యజమానులపై కేసు నమోదు చేసి వాహనాన్ని సీజ్ చేస్తాం.

– ఎం.వెంకటేశ్వర్లు, తహసీల్దార్, కొత్తకోట

కేసులు నమోదు చేస్తాం



కేజీవీల్స్‌తో ట్రాక్టర్లు రోడ్డుపై వెళితే యజమానులు, డ్రైవర్లపై కేసులు నమోదు చేస్తాం. కేజీవీల్స్‌తో ట్రాక్టర్ రోడ్డుపై కనిపిస్తే సమాచారం ఇవ్వాలి. వారి వివరాలను గోప్యంగా ఉంచుతాం. గ్రామాల్లో చాటింపు వేయించి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

– మంజునాథ్‌రెడ్డి, ఎస్‌ఐ, కొత్తకోట

ప్రతి పౌరుడు జాతీయభావం కలిగి ఉండాలి



మూలమళ్లలో పూలమాలవేసి నివాళి అర్పిస్తున్న బీజేపీ నాయకులు



ఖిల్లాఘనపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

ఆత్మకూర్: బీజేపీ మండలశాఖ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండలంలోని మూలమళ్లలో మహాత్మగాంధీ విగ్రహానికి జలాభిషేకం నిర్వహించి పూలమాలలువేసి నివాళి అర్పించారు. మండల అధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి, భగవంత్‌రెడ్డి, ఆనంద్‌రెడ్డి, వల్లూరి రవి తదితరులు ఉన్నారు.

ఖిల్లాఘనపురం: దేశంలోని ప్రతి పౌరుడు జాతీయ భావం కలిగి ఉండాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి పెద్దిరాజు, మండల అధ్యక్షుడు బుచ్చిబాబుగౌడ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో తిరంగా ర్యాలీ కార్యక్రమం నిర్వహించారు. ఈదమ్మ దేవాలయం నుంచి సంతబజార్ మీదుగా బస్టాండ్ వరకు జాతీయ జెండాలను పట్టుకుని ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో రవినాయక్, సత్యనారాయణ, దశరథం, గోపాల్‌రెడ్డి, ఈదమ్మ, అక్బర్, బెస్త శివ, రాజు తదితరులు పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రంలో బీజేపీ నాయకులు అంబేడ్కర్, మహాత్మగాంధీ విగ్రహాలకు పూలమాల వేసి నివాళి అర్పించారు. విష్ణువర్ధన్, వెంకటస్వామి, రాజేష్, ఎల్లస్వామి, నరేష్, గట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



గురువులను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

ఆత్మకూర్: పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని పట్టణంలో ఆదివారం విశ్వభారతి హైస్కూల్‌లో నిర్వహించారు. 2000–01 చెందిన పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు సమావేశమయ్యారు. గురువులు బాల్‌రాజు, ఉమాశంకర్, సత్యనారాయణ, అన్వర్‌బేగ్, విష్ణుప్రియ, దశరథ్, రఫియోద్దీన్, అగ్రీప, చంద్రయ్యలను పూలమాలలు, శాలువాలతో సత్కరించి సత్కరించారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు రాఘవేందర్, జునైద్‌బిన్‌సయిద్, ఆంజనేయులు, మల్లేష్, గోవర్ధన్, వెంకట్రాములు, విష్ణువర్ధన్, శ్రీలక్ష్మి, కవిత, లింగమ్మ, విజ్ఞులత, రమనమ్మ, రాజు తదితరులు ఉన్నారు.

ఉత్సాహంగా బెల్టు గ్రేడింగ్ పరీక్షలు



బెల్టులు పొందిన విద్యార్థులతో కృష్ణయ్య, ఇతర మాస్టర్లు

మహబూబ్‌నగర్ క్రీడలు: కరాటే, మార్షల్ ఆర్ట్స్‌తో దేహదారుఢ్యంతోపాటు మానసికంగా ఎదగవచ్చని జీకే మాస్టర్ షోటోకాన్ కరాటే దూ ఇండియా ఫౌండర్ చీఫ్ జి.కృష్ణయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాల ఆవరణలో ఆదివారం జీకే షోటోకాన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు, సీనియర్ మాస్టర్ శివకుమార్ ఆధ్వర్యంలో కరాటే బెల్టు గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కృష్ణయ్య మాట్లాడారు. స్వీయరక్షణ కోసం కరాటే, మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవాలన్నారు. మాస్టర్ శివకుమార్ మాట్లాడుతూ బెల్టు గ్రేడింగ్ పరీక్షలో దీక్షిత, సాకేత్, వినోద్, హర్షిత ప్రియ, సాయి సుశాంత్‌లు డబుల్ ప్రమోషన్ పొందగా ఇతర విద్యార్థులు వివిధ బెల్టులు సాధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాస్టర్లు దామోదర్, పవన్‌కుమార్, కళ్యాణ్, రిశ్విత్, పర్ష పాల్గొన్నారు.

కరాటేలో కింగ్‌షోటోకాన్ విద్యార్థుల ప్రతిభ

హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో ఆదివారం జరిగిన అంతర్జాతీయ కరాటే పోటీల్లో జిల్లా కేంద్రానికి చెందిన కింగ్‌షోటోకాన్ కరాటేదూ ఇండియా విద్యార్థులు ప్రతిభచాటి పతకాలు సాధించినట్లు ఫౌండర్ జహంగీర్‌పాష ఖాద్రీ తెలిపారు. ఆయా విభాగాల్లో సోఫియాన్ అలీ, సాబీర్‌పాష, మారియ బేగం బంగారు పతకాలు, అమాన్‌అలీ, ఉమేరాబేగం వెండి పతకాలు సాధించినట్లు తెలిపారు. పతకాలు సాధించిన విద్యార్థులను జహంగీర్‌పాష ఖాద్రీ అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గ్రాండ్ మాస్టర్లు సురేంద్ర కృష్ణ, రాకేష్‌కుమార్, మాస్టర్ కేశవ్‌గౌడ్, సత్య, శంకర్, అమర్‌సింగ్, అస్లం సిద్దిఖీ, కన్నన్‌గౌడ్, గోపన్న తదితరులు పాల్గొన్నారు.



పతకాలు సాధించిన విద్యార్థులతో మాస్టర్లు

ఉద్యోగ ఖాళీలతో ప్రజల ఇక్కట్లు

వీపనగండ్ల: మండలంలో మండల, గ్రామ స్థాయి అధికారుల పోస్టులు భర్తీ చేయకపోవడంతో ప్రజలు, విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు. మండల అభివృద్ధి అధికారి పోస్టును భర్తీ చేయకపోవడంతో మండల పంచాయతీ అధికారికి బాధ్యతలు అప్పగించారు. అలాగే మండల విద్యాధికారి పోస్టును భర్తీ చేయలేదు. పంచాయతీ రాజ్ ఏఈ పోస్టుతో పాటు ఎంపీడీఓ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్ మరో రెండు అటెండర్ పోస్టులు, బీసీ హాస్టల్ వార్డెన్ పోస్టులతో పాటు మండలంలోని జిల్లా పరిషత్, ప్రాథమిక పాఠశాలల్లో దాదాపు 70 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మండల కేంద్రానికి బస్సు వసతులు లేవన్న కారణం చేత ఉద్యోగులు, ఉపాధ్యాయులు మండలంలోని ఉద్యోగాల్లో చేరడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మండలంలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

గొర్రెల మందపై కుక్కల దాడి



గోపాల్‌పేట: గొర్రెల మందపై కుక్కలు దాడి చేసిన ఘటన మండలంలోని తాడిపర్తిలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నక్క రాములు యాదవ్‌కు 53 గొర్రెలను తన ఇంటి పక్కన ఇనుప కంచెలో నిలిపి రాత్రి పడుకున్నారు. ఆదివారం ఉదయం లేచి చూసేసరికి గొర్రెల మందపై కుక్కలు దాడిచేసినట్లు గుర్తించారు. పది గొర్రెలు మృతి చెందగా, మరో పది తీవ్ర గాయాలు కాగా, 8 గొర్రెలకు స్వల్పంగా గాయాలయ్యాయి. వీటి విలువ సుమారు రూ.2లక్షల వరకు ఉంటుందని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

సభ్యత్వం తీసుకున్న ఉపాధ్యాయులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: టీజాక్ గౌరవాధ్యక్షుడు గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం జిల్లాకు చెందిన ఉపాధ్యాయులు మరికంటి బాలరాజు, విజయభూషణ్, రాజశేఖర్ రెడ్డి, కిరణ్‌కుమార్, కుర్మయ్య, శ్రీనివాసులు, సురేష్, మౌలానా, శ్రీనివాస్ తదితరులు పీఆర్‌టీయూ (తెలంగాణ) సభ్యత్వం తీసుకున్నారు. ఈ సందర్భంగా మరికంటి బాలరాజు మాట్లాడుతూ ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు తదితర సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నారని పేర్కొన్నారు. త్వరలోనే సర్వీస్ రూల్స్ రూపకల్పన, ఉపాధ్యాయ, ఉద్యోగులకు మెరుగైన ఆరోగ్య పథకం, పీఎస్‌హెచ్‌ఎం పోస్టుల మంజూరు, ఎస్‌జీటీలకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటుహక్కు కల్పిస్తారని ఆశిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు భూపతిసింగ్, గోనెల శ్రీధర్, ఉపాధ్యక్షుడు కెంచె రాఘవేందర్, జిల్లా అధ్యక్షుడు శ్యాంబాబు, కార్యదర్శులు నవాబుపేట శ్రీనివాస్, ఖదీర్‌పాషా, శివానంద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రెడ్‌క్రాస్ వార్షికోత్సవం

పాలమూరు: ఇండియన్ రెడ్‌క్రాస్ రక్తనిధి కేంద్రం 22వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ చైర్మన్ నటరాజ్‌తో పాటు ఇతర సిబ్బంది కేకు కట్‌చేసి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా నటరాజ్ మాట్లాడుతూ గత 22 ఏళ్ల కిందట అప్పటి గవర్నర్ సి.రంగరాజన్ చేతులమీదుగా ప్రారంభం చేసినట్లు తెలిపారు. బాబుల్ రెడ్డి, రమణయ్య, చంద్రశేఖర్, అశోక్‌కుమార్, హేమలత, రాజేష్ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

ఆత్మకూర్: పట్టణానికి చెందిన చెందిన లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ఆదివారం తన నివాసంలో అందజేశారు. వడ్డెశివకు రూ.60వేలు, రాజుకు రూ.42 వేలు, రఘుకు రూ.21 వేలు, జ్యోతికి రూ.7,500, ప్రభావతికి రూ.52 వేలు చెక్కులను ఇచ్చారు. వివిధ అనారోగ్యాలతో ఆసుపత్రుల్లోచేరి చికిత్సలు చేయించుకున్న బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో పరమేష్, శ్రీనివాసులు, షబ్బీర్‌అహ్మద్, ఇమ్రాన్, రఘు, రఫి, నిరంజన్, రాజశేఖర్, ఖాజ, హుస్సేన్‌మియ్య, చాంద్‌పాష ఉన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి



మాందాపూర్‌లో మొక్కలు నాటుతున్న కృష్ణసాగర్

పాన్‌గల్: పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని సాగర్ స్నేక్స్ సొసైటీ వ్యవస్థాపకుడు కృష్ణసాగర్ పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని మాందాపూర్ గ్రామంలో 'నా పర్యావరణ పరిరక్షణ' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వాయు కాలుష్యం పెరిగిపోతుండటంతో జూన్ 22వ తేదీన జోగులాంబ గద్వాల జిల్లా ఆలంపూర్ నుంచి హైదారాబాద్ వరకు 17 రోజులు పాదయాత్ర చేస్తూ రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటుకుంటూ గ్రామ గ్రామాన అవగాహన కల్పించడం జరిగిందన్నారు. ఈ యాత్ర ఇంతటితోనే ముగించకుండా ప్రతి ఆదివారం ఒక గ్రామం ఒక తరం అనే కార్యక్రమంలో గ్రామస్తుల చేత మొక్కలు నాటించి వారికి అవగాహన కల్పించినట్లు ఆయన పేర్కొన్నారు.

రాజీవ్‌జ్యోతి యాత్రను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న రహ్మతుల్లా

ఆత్మకూర్: మాజీ ప్రధాని దివంగత రాజీవ్‌గాంధి జ్యోతియాత్ర బైక్ ర్యాలీని విజయవంతం చేయ్యాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి రహ్మతుల్లా, తులసిరాజ్‌యాదవ్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో యువజన కాంగ్రెస్ సమావేశం నిర్వహించారు. సోమవారం నియోజకవర్గ కేంద్రంలో భారీ బైక్ ర్యాలీకి ఆత్మకూర్ మండలం నుంచి అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో వంశీ, శ్రీకాంత్, అశోక్, సతీష్, రఘు తదితరులు పాల్గొన్నారు.

కార్యాలయాల్లో లోపించిన పారిశుద్ధ్యం



పాన్‌గల్ తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో పిచ్చి మొక్కలు

పాన్‌గల్: పారిశుద్ధ్య నివారణ, పచ్చదనం పెంపు కోసం ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తున్న వాటి గురించి ప్రభుత్వ కార్యాలయాల అధికారులు తమకు వర్తించనట్టు వ్యవహరిస్తున్నారని మండల ప్రజలు చర్చించుకుంటున్నారు. ప్రతి శుక్రవారం డ్రై డేగా పాటించాలని అవగాహన కల్పిస్తున్నా అధికారులు.. కార్యాలయాలను మాత్రం శుభ్రం చేసుకోవడం లేదు. ఇటీవల ఐదు రోజుల పాటు నిర్వహించిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలను శుభ్రం చేయాలనే నిబంధన ఉన్న ఏమాత్రం పట్టించుకోలేదు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణ నిండా పిచ్చిమొక్కలు దర్శనమిస్తున్నాయి. దీంతో పాటు మరో గదిలో చిత్తు పేపర్లు, వివిధ దరఖాస్తు కాగితాలు, ఓటరు గైడ్ పేపర్లు చిందర వందరగా పడేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణ సమీపంలో ఖాళీ స్థలంలో పిచ్చిమొక్కలు, నీటి నిల్వలతో దోమలకు ఆవాసంగా మారింది. ఇప్పటికైన జిల్లా అధికారులు స్పందించి ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో పారిశుద్ధ్య నివారణ చర్యలు చేపట్టే విధంగా తగు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.



ఓ గదిలో చిందరవందరగా పేపర్లు



పాన్‌గల్ పీహెచ్‌సీ ఆవరణ సమీపంలో..

పనుల్లో నాణ్యత లోపించొద్దు : ఎమ్మెల్యే



రహదారి పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

పెబ్బేరు రూరల్: రహదారి నిర్మాణ పనుల్లో నాణ్యత లోపించొద్దని.. త్వరితగతిన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోని తీసుకురావాలని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి కాంట్రాక్టర్‌కు సూచించారు. ఆదివారం పట్టణంలో కొనసాగుతున్న వనపర్తి–పెబ్బేరు రహదారి పనులను స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. ఆయన వెంట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అక్కి శ్రీనివాస్‌గౌడ్, సురేందర్‌గౌడ్, గంధం రంజిత్‌కుమార్, వెంకటేష్‌సాగర్, రాములు, నర్సింహ తదితర ఉన్నారు.

చదరంగం పోటీలు

జడ్చర్ల: స్థానికంగా ఆదివారం అవోపా ఆధ్వర్యంలో విద్యార్థులకు చదరంగం పోటీలు నిర్వహించారు. విద్యార్థులలో మేధాశక్తిని పెంపొందించేందుకు చదరంగం ఉపయోగపడుతుందని ఈ సందర్భంగా నిర్వాహకులు తెలిపారు. సీనియర్, జూనియర్ విభాగాలకు సంబంధించి దాదాపు 200 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మురళీకృష్ణ, శ్రీనివాస్, శివకుమార్ పాల్గొన్నారు.